జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
WWW.DASHANEWS.COM
మంగళవారం 04-08-2026
సంపుటి 1 సంచిక 252
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195




**విపక్షాల ఆందోళనతో మరోసారి లోక్‌సభ వాయిదా**
4లో





## నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ అభినందనలు

**దశ, హైద్రాబాద్:** నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందన్నారు. నిమ్స్ లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని అన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం ఆకాంక్షించారు.

### రంగారెడ్డి జిల్లాలో

# నకిలీ మందుల మాఫియా?

### చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు?


ఫైల్ ఫొటో

### అనుమతులు లేకుండానే బయో స్టిములెంట్స్, అగ్రి కెమికల్స్ తయారీ..

### అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం

**దశ, రంగారెడ్డి ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో నకిలీ వ్యవసాయ మందుల తయారీ యథేచ్ఛగా కొనసాగుతోందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కోహెడ, ఉప్పరిగూడ,కుంట్లూర్ , ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో కొంతమంది నిర్వాహకులు అవసరమైన ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు లేకుండానే బయో స్టిములెంట్స్, అగ్రి కెమికల్స్ తయారు చేసి విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు సమాచారం అందించినప్పటికీ ఎలాంటి చర్యలు కనిపించకపోవడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం ఉప్పరిగూడలోని ఒక సంస్థ కనీస దరఖాస్తులు కూడా చేయకుండా తయారీ కార్యకలాపాలు కొనసాగిస్తోందని చెబుతున్నారు. ఇదే తరహాలో కోహెడలోని శ్రీ చైతన్య కళాశాల పరిసరాల్లో మరో సంస్థ కూడా నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమాచారం అందినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అనుమతుల ప్రక్రియలోనూ భారీ అక్రమాలు


..మిగతా 4వ పేజీలో


ఫైల్ ఫొటో

# రంగనాథ్ తప్పిస్తారా?







### హైడ్రాపై కోర్టు సీరియస్.. ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా చుట్టూ న్యాయపరమైన ముళ్లకంప అల్లుకుంటోంది. కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే లేదా ఒకరి తర్వాత ఒకరుగా ఏకంగా ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు ఈ ఏజెన్సీ తీరుపై, దాని అధిపతి ఐపీఎస్ అధికారి ఎ.వి. రంగనాథ్ వైఖరిపై తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. బుల్డోజర్ సంస్కృతి, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలకు దిగడం, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం వంటి చర్యలపై న్యాయస్థానం చేసిన ఘాటు వ్యాఖ్యలు హైడ్రా భవిష్యత్తును ప్రశ్నార్థకంలోకి నెట్టాయి. లోతుకుంట భూ వివాదానికి సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసులో రంగనాథ్‌ను వెంటనే పదవి నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశించినంది. హైడ్రాను పౌరాణిక రాక్షస మృగంతో పోల్చిన న్యాయమూర్తి, తమను తాము సూపర్ కాప్స్ గా భావించుకోవడం చెల్లదని స్పష్టం చేశారు. కేవలం ఈ ఒక్క బెంచ్ మాత్రమే కాకుండా, ఇతర న్యాయమూర్తులు కూడా వేర్వేరు పిటిషన్లపై విచారణ సందర్భంగా నోటీసులు ఇవ్వకుండా చేపడుతున్న ఆకస్మిక చర్యలను, విచారణాధికారాల అతిక్రమణను తీవ్రంగా తప్పుబట్టారు. స్వయంగా కమిషనర్ రంగనాథ్ దాదాపు 62 కోర్టు ధిక్కరణ కేసుల్లో నిందితుడిగా ఉండటం న్యాయవ్యవస్థ తీవ్రంగా పరిగణించిన అంశంగా మారింది.హైడ్రా చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన డ్రీమ్ ప్రాజెక్టుగా, బ్రాండ్ హైదరాబాద్ పునరుద్ధరణగా ప్రచారం చేసుకున్నారు. ప్రారంభంలో ప్రజల నుంచి, పర్యావరణ వేత్తల నుంచి

..మిగతా 4వ పేజీలో



## మునిగిపోనున్న సంగమేశ్వరుడు

### జలాధివాసానికి సిద్ధమైన ఆలయం

4లో

### వర్ధన్నపేట గురుకులంలో

## ఫుడ్ పాయిజన్

### 25 మంది విద్యార్థినులకు అస్వస్థత



**దశ, వరంగల్:** వర్ధన్నపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రాత్రి కలుషిత ఆహారం తిని 25 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధిత విద్యార్థినులను వెంటనే చికిత్స నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తరచూ గురుకులాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## ఎల్‌నినో నేపథ్యంలో సాగు మార్గదర్శక పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

వివరాలు 4లో



## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి: భట్టి విక్రమార్క

**దశ, బాల్టిమోర్ (అమెరికా):** అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ATA) 19వ జాతీయ మహాసభల్లో పాల్గొన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవాస భారతీయులు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. సింగిల్ విండో విధానంలో వేగంగా అనుమతులు మంజూరు చేసి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులను వివరించిన ఆయన, ఎన్ఆర్ఐల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందని వెల్లడించారు.

## నిరుద్యోగుల మెరుపు సమ్మె

**దశ, హైదరాబాద్:** ఇందిరా పార్క్ చౌరస్తాలో నిరుద్యోగులు ల మెరుపు ధర్నాకు దిగారు. 7,437 పోస్టులతో కాకుండా 19 వేల పోలీస్ ఉద్యోగాలకు మరో నోటిఫికేషన్ విడుదల చేయాలి . పోలీస్ ఉద్యోగాల వయోపరిమితి పెంచాలంటూ డిమాండ్ చేసారు. నోటిఫికేషన్ ఆలస్యంతో వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. పోలీస్ నోటిఫికేషన్లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేసారు. దరఖాస్తు రుసుమును వెంటనే తగ్గించాలని, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నిరుద్యోగుల హెచ్చరించారు.






## రంగంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి..

## 'ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి'

**దశ, హైదరాబాద్:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా మాతంగి స్వర్ణలత పచ్చికుండపై నిలబడి సంప్రదాయ పద్ధతిలో భవిష్యవాణి వినిపించారు. భవిష్యవాణిలో ఈ ఏడాది కుంభవృష్టి

..మిగతా 4వ పేజీలో

## ఫుడ్ సేఫ్టీ అధికారుల పేరుతో మోసాలు..

4లో



# రంగనాథ్ తప్పిస్తారా?

**మొదటి పేజీ తరువాయి**

పెద్ద ఎత్తున మద్దతు లభించినప్పటికీ, రోజువారీ కార్యకలాపాల్లో చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకపోవడమే ప్రస్తుతం ఏజెన్సీకి గొడ్డలిపెట్టుగా మారింది. ప్రతిపక్షాల విమర్శల కంటే కూడా, న్యాయస్థానాలు వరుసగా ఇస్తున్న ప్రతికూల తీర్పులు, వ్యాఖ్యలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజకీయంగా, పాలనాపరంగా పెద్ద సవాలుగా పరిణమించాయిహైకోర్టు ఏకంగా సీఎస్‌ను ఉద్దేశించి న్యాయసమ్మతమైన ఆదేశాలను గౌరవించే అధికారిని నియమించండి అని స్పష్టమైన సూచన చేయడంతో ఇప్పుడు బంతి రేవంత్ రెడ్డి కోర్టులోకి చేరింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి రంగనాథ్‌ను అదే పోస్టులో కొనసాగిస్తే, అది ప్రభుత్వం , న్యాయవ్యవస్థ మధ్య మరింత ఘర్షణ వాతావరణానికి దారితీసే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ప్రభుత్వం ఆశించిన హైడ్రా అసలు లక్ష్యం పక్కదారి పట్టి, కేవలం చట్టవిరుద్ధమైన ఏజెన్సీగా ముద్రపడే ప్రమాదముంది. ఈ పరిణామాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరితగతిన నిర్ణయం తీసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎ.వి. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, మరొక అధికారికి బాధ్యతలు అప్పగించడం ద్వారా కోర్టు ఆదేశాలను గౌరవించినట్లవుతుందని, అలాగే ఏజెన్సీపై పడిన మరకను చెరిపేసి చట్ట పరిధిలోనే ఆక్రమణలపై చర్యలు కొనసాగించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రాబోయే రెండు మూడు రోజుల్లో హైడ్రా నాయకత్వ మార్పుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.


# నకిలీ మందుల మాఫియా?

**మొదటి పేజీ తరువాయి**

జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఆధునిక ల్యాబ్ సౌకర్యాలు, హెచ్‌పీఎల్‌సీ (HPLC) వంటి పరీక్షా పరికరాలు తప్పనిసరిగా ఉండాల్సి ఉండగా, తనిఖీల సమయంలో మాత్రమే తాత్కాలికంగా అద్దెకు పరికరాలు తీసుకొచ్చి చూపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శాశ్వత ల్యాబ్ ఏర్పాటు చేయాలంటే రూ.25 నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుండగా, తనిఖీల కోసం తక్కువ మొత్తానికి పరికరాలు అద్దెకు తెచ్చి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా, మండల స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన చోట నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సింది పోయి పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమాచారం ఇచ్చిన వారిపైనే ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇటీవల పెద్ద అంబర్‌పేట సమీపంలో నకిలీ డీఏపీ ఎరువుల తయారీ గోదాం బయటపడిన ఘటనను రైతులు గుర్తు చేస్తున్నారు. వేలాది బస్తాల నకిలీ ఎరువులను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినప్పటికీ, వ్యవసాయ శాఖ మాత్రం అలాంటి ఘటనలపై తగిన అప్రమత్తత ప్రదర్శించడం లేదని అంటున్నారు. పత్రికా ప్రతినిధులు నకిలీ కంపెనీలపై వివరాలు అడిగినా, "మా పరిధిలో అలాంటి కంపెనీలు లేవు... ఉంటే మీరే సమాచారం ఇవ్వండి" అని అధికారులు చెప్పడం వారి పనితీరుపై మరిన్ని అనుమానాలకు తావిస్తోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ వెంటనే ప్రత్యేక దర్యాప్తు జరిపించి, అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలపై, అలాగే విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఓ అధికారి తాను ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహిత బంధువునని చెప్పుకుంటూ తనదైన శైలిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సదరు అధికారిపై వినిపిస్తున్నాయి. అందుకే నకిలీ కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవం ఏమిటో ప్రభుత్వం తేల్చాలని రైతులు కోరుతున్నారు." ఈ విషయాలపై వ్యవసాయశాఖ అధికారి పల్లవిని జ్వాలా దశ ప్రతినిధి వివరణ కోరగా అనుమతులు లేని వారిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

# విద్యా వ్యవస్థ అంత దారుణమా?

## లక్షల డిగ్రీలు.. కానీ ఉద్యోగానికి సరిపోతున్నది కేవలం 15 శాతమే!



**దశ, హైదరాబాద్ :** ప్రతి ఏడాది రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సుమారు 1.10 లక్షల మంది విద్యార్థులు పట్టాలు అందుకుంటున్నారు. కానీ ఆ డిగ్రీలు ఉద్యోగాలకు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయనే ప్రశ్న ఇప్పుడు అందరినీ ఆలోచింపజేస్తోంది. పరిశ్రమల అంచనాలకు అనుగుణంగా కేవలం 15 శాతం మంది మాత్రమే ఉద్యోగాలకు సిద్ధంగా ఉండగా, మిగిలిన 85 శాతం మంది ప్రాథమిక నైపుణ్యాల విషయంలోనే వెనుకబడుతున్నారని ప్రభుత్వమే చెబుతోంది. ఇది కేవలం గణాంకం కాదు.. రాష్ట్ర విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న చేదు వాస్తవం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. అంతకుముందు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అసెంబ్లీ వేదికగా ఇదే ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరు ముఖ్యమంత్రులు వేర్వేరు సందర్భాల్లో ఒకే సమస్యను ప్రస్తావించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రాజకీయాలకు అతీతంగా చూస్తే, ఇది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలక అంశం. గత రెండు దశాబ్దాలుగా సాంకేతిక విద్య క్రమంగా వ్యాపారంగా మారిపోయింది. అనుమతులు పొందడమే లక్ష్యంగా అనేక ప్రైవేట్ కళాశాలలు ఏర్పడ్డాయి. కానీ వాటిలో నాణ్యమైన అధ్యాపకులు, ఆధునిక ప్రయోగశాలలు, పరిశ్రమలకు అనుసంధానమైన శిక్షణ, పరిశోధనా వాతావరణం చాలాచోట్ల కనిపించడం లేదు. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో వేగంగా ముందుకెళ్తుంటే, మన విద్యార్థుల్లో చాలామంది ఇంకా కాలం చెల్లిన సిలబస్‌తోనే చదువు పూర్తిచేస్తున్నారు. చదువు అంటే కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడం కాదనే విషయాన్ని మన విద్యా వ్యవస్థ మరిచిపోయినట్టుగా కనిపిస్తోంది. పుస్తకాలను బట్టీ పట్టి పరీక్షలు రాసే విధానం వల్ల విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, టీమ్‌వర్క్ వంటి అంశాలు విద్యార్థుల్లో పెరగడం లేదు. ఫలితంగా డిగ్రీ ఉన్నా ఉద్యోగానికి అవసరమైన కనీస అర్హతలు కూడా చాలామందిలో కనిపించడం లేదు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. అయినప్పటికీ చదువు పూర్తయ్యాక ఉద్యోగ అవకాశాలు దక్కకపోవడం, నిరుద్యోగం పెరగడం, ప్రభుత్వ ఉద్యోగాలపైనే యువత ఆశలు పెట్టుకోవడం ఆందోళన కలిగించే విషయం. దీనికి విద్యార్థులను మాత్రమే బాధ్యులను చేయడం సరైంది కాదు. వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు, కళాశాలలపైనే ఉంది. ఇప్పుడు అవసరమైనది విమర్శలు కాదు.. సంస్కరణలు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను ఎప్పటికప్పుడు నవీకరించాలి. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్ ఆధారిత బోధన, స్టార్టప్ సంస్కృతి, డిజిటల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు విద్యలో కీలక స్థానం కల్పించాలి. విద్యార్థులు డిగ్రీ కోసం కాకుండా నైపుణ్యాల కోసం చదివే వాతావరణాన్ని సృష్టించాలి. ప్రపంచ స్థాయిలో పోటీ పడే యువశక్తి తెలంగాణకు ఉంది. వారికి సరైన దిశ, నాణ్యమైన విద్య, ఆధునిక శిక్షణ అందితే అద్భుతాలు సృష్టించగలరు. డిగ్రీలు పంచే విద్యా వ్యవస్థ నుంచి ప్రతిభను తీర్చిదిద్దే విద్యా వ్యవస్థ వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. అదే జరిగితేనే నేటి యువతకు నిజమైన భవిష్యత్తు, రాష్ట్రానికి స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

# ఈపీఎఫ్ గరిష్ఠ వేతన పరిమితి 25 వేలకు పెంపు?

## కేంద్రం పరిశీలనలో ప్రతిపాదనలు

**హైదరాబాద్:** ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్) గరిష్ఠ వేతన పరిమితి పెరగనుంది. ప్రస్తుతం ఉన్న రూ.15 వేలను రూ.25 వేలుగా ఖరారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జీవన వ్యయం పెరిగినప్పటికీ... దాదాపు 12 ఏళ్లుగా గరిష్ఠ వేతన పరిమితి పెరగలేదు. దీంతో వేతన పరిమితి పెంచాలని కొన్నేళ్లుగా కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై పలు దఫాలుగా చర్చించిన కార్మికశాఖ రూ.25 వేలకు పెంచేందుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే కొత్త ఈపీఎఫ్ 26, ఈపీఎస్26 పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఈపీఎఫ్‌వో... గరిష్ఠ వేతన పరిమితినీ త్వరలో పెంచేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తోంది. అదే సమయంలో కనీస పింఛను పెంపు ప్రతిపాదన సైతం పరిశీలనలో ఉంది. గరిష్ఠ వేతన పరిమితి పెంచేందుకు ఇప్పటికే ఆర్థిక శాఖ అనుమతించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనల్ని మంత్రిమండలి ఆమోదించిన తర్వాత ఈపీఎఫ్‌వో పథకంలో అవసరమైన మార్పుల అనంతరం సీబీటీ ఆమోదంతో అమల్లోకి రానుంది. ఈ పెంపు అమల్లోకి రావడానికి కొంత సమయం పడుతుందని ఈపీఎఫ్‌వో వర్గాలు, కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

### వేతన జీవులకు లాభమిలా...

గరిష్ఠ వేతన పరిమితి రూ.25 వేలకు పెరిగితే.. ఉద్యోగి పీఎఫ్ ఖాతాలో జమయ్యే నిల్వ పెరుగుతుంది. గతంలో రూ.15 వేలు ఉన్నప్పుడు ఉద్యోగి వేతనం నుంచి 12% చొప్పున రూ.1,800 జమయ్యేవి. రూ.25 వేల మీద 12% చొప్పున జమయ్యే మొత్తం రూ.3 వేలకు పెరగనుంది. ఉద్యోగితో సమానంగా యజమాని 12% మొత్తాన్ని ఉద్యోగి ఈపీఎఫ్ ఖాతాలో జమ చేస్తారు. ఇందులో 8.33% పింఛను నిధికి, మిగతా మొత్తం ఉద్యోగి పీఎఫ్ ఖాతాలో జమవుతుంది. గరిష్ఠ వేతన పరిమితి రూ.25 వేలకు పెరగడంతో పదవీ విరమణ తర్వాత చేతికి వచ్చే పింఛనూ పెరుగుతుంది. ప్రస్తుతం దామాషా పద్ధతిలో పింఛను లెక్కింపు జరగుతోంది. ఈ పరిమితి పెంపు అమల్లోకి వచ్చినప్పటి నుంచి పదవీ విరమణ వరకు చేసిన సర్వీసుకు రూ.25 వేల వేతనంపై పింఛను లెక్కిస్తారు. 2014 నుంచి పెంపు అమల్లోకి వచ్చే తేదీ వరకు చేసిన సర్వీసుకు రూ.15 వేలపై... అంతకుముందు సర్వీసుకు రూ.6,500పై లెక్కింపు ఉంటుంది. ఈ మూడు మొత్తాలను కలిపి తుది పింఛను ఖరారు చేస్తారు. అయితే, పింఛను లెక్కింపు ఫార్ములా, గరిష్ఠ పింఛను అర్హత వేతనం ఖరారులో ఏమైనా మార్పులు జరిగితే ఆ మేరకు పింఛనుపై ప్రభావం ఉంటుంది.





# మునిగిపోనున్న సంగమేశ్వరుడు

## జలాధివాసానికి సిద్ధమైన ఆలయం

**దశ, నంద్యాల:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సంగమేశ్వరం దేవాలయం మరోసారి శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్లలో జలాధివాసానికి చేరువైంది. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతుండటంతో ఆలయం త్వరలో నీటిలో మునిగిపోయే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 849.6 అడుగులకు చేరుకుంది. నీటిమట్టం 841 అడుగులు దాటిన తర్వాత ఆలయ గర్భగుడిలోకి నీరు ప్రవేశించడం ప్రారంభమవుతుంది. అనంతరం నీటి మట్టం 867 అడుగులకు చేరుకుంటే సంగమేశ్వరం ఆలయం పూర్తిగా జలమయం అవుతుంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం పెరగడంతో సంగమేశ్వర ఆలయం కొన్ని నెలలపాటు నీటిలోనే ఉంటుంది. నీటిమట్టం తగ్గిన తర్వాతే ఆలయం తిరిగి భక్తుల దర్శనానికి తెరుచుకుంటుంది. సాధారణంగా సుమారు ఎనిమిది నెలల తర్వాత భక్తులకు స్వామివారి దర్శనం లభిస్తుంది. ఈ నేపథ్యంలో సంగమేశ్వర స్వామిని దర్శించుకోవాలనుకునే భక్తులు నీటిమట్టం మరింత పెరగకముందే ఆలయాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అధికారులు కూడా శ్రీశైలం జలాశయ నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

### రంగంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి..

# 'ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి'

**మొదటి పేజీ తరువాయి**

వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ప్రాణనష్టం, అగ్ని ప్రమాదాలు సంభవించే పరిస్థితులు ఉండవచ్చని హెచ్చరించారు. ఎలాంటి ఆపద వచ్చినా అమ్మవారి కటాక్షం ప్రజలను కాపాడుతుందని పేర్కొన్నారు.అలాగే సమాజంలో వావి వరసలు, విలువలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ధర్మబద్ధంగా, పరస్పర గౌరవంతో జీవించాలని సూచించారు. తన విగ్రహ ప్రతిష్ఠ గురించి ప్రస్తావిస్తూ, ఆరు నెలల్లో ప్రతిష్ఠ జరగాలని, అడ్డంకులు సృష్టించే వారిపై అమ్మవారి అనుగ్రహంతో చర్యలు ఉంటాయని వ్యాఖ్యానించారు.రంగం సందర్భంగా మాతంగి స్వర్ణలత భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె భవిష్యవాణిని వినేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రతి ఏడాది బోనాల సందర్భంగా నిర్వహించే రంగం కార్యక్రమాన్ని భక్తులు అత్యంత విశ్వాసంతో వీక్షిస్తారు.




# ఫుడ్ సేఫ్టీ అధికారుల పేరుతో మోసాలు

## అప్రమత్తంగా ఉండాలి

### లైసెన్స్‌లు, శిక్షణ కోసం అధికారులను మాత్రమే సంప్రదించాలి: జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్

**దశ, రంగారెడ్డి :** ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారుల పేరుతో కొందరు వ్యక్తులు వ్యాపారులను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్ హెచ్చరించారు. ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, ఆహార భద్రత తనిఖీల పేరుతో కొందరు "ట్రైనింగ్ సర్టిఫికెట్లు ఇప్పిస్తాం", "ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌లు ఇప్పిస్తాం" అంటూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు శాఖ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఇలాంటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, వారికి నగదు చెల్లించవద్దని వ్యాపారులకు సూచించారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు, శిక్షణ కార్యక్రమాలు లేదా ఇతర అధికారిక సేవలకు సంబంధించి నేరుగా జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలని కోరారు. అన్ని సేవలు ప్రభుత్వ నిబంధనలు, అధికారిక విధానాల ప్రకారమే అందించబడతాయని స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, మోసపూరిత ఘటనలు ఎదురైతే వెంటనే జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖకు సమాచారం అందించాలని, వ్యాపారులు అప్రమత్తంగా ఉండి మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# ఎల్‌నినో నేపథ్యంలో సాగు మార్గదర్శక పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

**దశ, రంగారెడ్డి:** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక సాగు మార్గదర్శక పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ రూపొందించిన ఈ మార్గదర్శక పుస్తకం రైతులకు శాస్త్రీయ సాగు విధానాలు, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, నీటి వినియోగం, పంటల నిర్వహణపై ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ మార్గదర్శకాలను గ్రామస్థాయిలో రైతులకు విస్తృతంగా చేరవేసి అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.



# విపక్షాల ఆందోళనతో మరోసారి లోక్‌సభ వాయిదా

**దశ, న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల నేపథ్యంలో లోక్‌సభను మరోసారి మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు తమ డిమాండ్లపై ఆందోళనకు దిగడంతో సభలో గందరగోళం నెలకొంది. పలుమార్లు సభ్యులను శాంతించాలని స్పీకర్ కోరినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సభా కార్యక్రమాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కీలక బిల్లులు, ప్రశ్నోత్తరాల కార్యక్రమం మరోసారి నిలిచిపోయింది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com